సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



ఓటమి బాధ్యత నాదే..
అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై పూర్తి బాధ్యత తనదేనని, ఎవరినీ నిందించాల్సిన పనిలేదని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు.
- 9లో ▸



మా బతుకులు ఆగం..
ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి పథకం కారణంగా తమ బతుకులు ఆగమవుతాయని ఆటో డ్రైవర్లు పేర్కొంటున్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
28.1 /17.5

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

పేదలందరికీ ఉచిత కార్పొరేట్ వైద్యం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణంలోని జిల్లా కేంద్రాస్పత్రిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'చేయూత' రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 10 లక్షల బీమా పథకాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేయూత పథకం ద్వారా వైద్యఖర్చుల పరిధిని రూ. 10 లక్షలకు పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్, ఆర్ఎంవో శ్రీనివాస్, వైద్యాధికారులు, వైద్యులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రమణారెడ్డి



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శనివారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి దేవాలయంలో పూజలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రోటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ముందు ప్రమాణం స్వీకారం చేయబోమని పార్టీ నిర్ణయం మేరకు అసెంబ్లీ సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో కామారెడ్డి ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం స్పీకర్ సమక్షంలో మరోరోజు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రోటెం స్పీకర్ నియామకంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు చెప్పారు.

హైకోర్టు జడ్జికి స్వాగతం



కామారెడ్డి క్రైం : హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ శనివారం కామారెడ్డికి విచ్చేశారు. ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయనకు జిల్లా జడ్జి శ్రీదేవి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ స్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. అనంతరం ఆయన కామారెడ్డి కోర్టులో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా మంజూరైన మరో కోర్టు ఏర్పాటునకు సంబంధించిన గదులను పరిశీలించారు. అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 56వేల 259 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

యథావిధిగా ప్రజావాణి

కామారెడ్డి క్రైం : ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 11 నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నెల రోజులుగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ లేదన్నారు. ఎన్నికలు ముగిసినందున ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుండి ప్రజావాణి ఉంటుందన్నారు.

12న విజయేంద్ర సరస్వతి స్వామి రాక

నిజామాబాద్ సిటీ: నగరంలోని గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రానికి ఈ నెల 12న శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి రానున్నారు. 13న ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

కేసీఆర్ ఎందుకు ఓడిండు!?

- పెద్దాయన ఓటమిపై పోస్టుమార్టం షురూ
- నియోజకవర్గంలో ఆరా తీస్తున్న సర్వే బృందాలు
- వివిధ వర్గాలతో మాట్లాడి వివరాల సేకరిస్తున్న వైనం

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఓటమికి కారణాలపై ఆ పార్టీ నాయకత్వం ఆరా తీస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో కేసీఆర్ వెంట నడిచిన కామారెడ్డి ప్రాంత ప్రజలు భారీ మెజారిటీతో గెలిపిస్తారని అంతా భావించారు. కానీ ఫలితం అందుకు విరుద్ధంగా రావడం పార్టీ నాయకత్వాన్ని విస్మయానికి గురిచేసింది. కేసీఆర్ ఓటమికి గల కారణాలను తెలుసుకునేందుకు బృందాలను రంగంలోకి దించింది.





సాక్షి, కామారెడ్డి : ఉద్యమంలో అగ్రభాగాన నిలిచిన కామారెడ్డి ప్రాంతం సీఎం కేసీఆర్‌ను అక్కున చేర్చుకుని భారీ మెజారిటీతో గెలిపిస్తారన్న నమ్మకంతోనే ఆయన ఇక్కడి నుంచి పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. కేసీఆర్ అభ్యర్థిత్వంపై ప్రచారం జరగడంతో గులాబీ శ్రేణుల్లో కూడా ఉత్సాహం కనిపించింది. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కొడుకు వివాహానికి సీఎం కేసీఆర్ హాజరైన సందర్భంలో బీఆర్ఎస్ శ్రేణులు చేసిన నినాదాలు మిన్నంటాయి. అయితే ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పార్టీ శ్రేణుల్లో ఆ ఊపు కనిపించలేదు. బీఆర్ఎస్ నాయకులు, శ్రేణుల్లో గెలుస్తామన్న నమ్మకం లేకుండాపోయింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఎన్నికల ఇన్‌చార్జీగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. సభలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగులతో హంగామా చేసినా, ఆఖరుకు ఓడిపోవడం ఆ పార్టీ నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేసింది. ఓటమి ఎరుగని నేతగా కేసీఆర్ ఎన్నో రికార్డులు సొంతం చేసుకున్నారు. ఎక్కడ పోటీ చేసినా భారీ మెజారిటీతో గెలుస్తూ వచ్చారు. ఉద్యమ ప్రభావం లేని ప్రాంతాల్లోనే గెలిచిన కేసీఆర్ పోరాటాల గడ్డగా కీర్తికెక్కిన కామారెడ్డిలో ఓడిపోవడం ఆ పార్టీ నాయకత్వానికి మింగుడుపడడం లేదు. కామారెడ్డి నియోజక వర్గంతో కలిసి ఉండే ఎల్లారెడ్డి నియోజక వర్గంలోనూ పార్టీ అభ్యర్థి ఓడిపోవడం మూలంగా పార్టీకి గట్టి దెబ్బ తగిలిందని భావిస్తున్నారు. కేసీఆర్ మరోసారి సీఎం అయి కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజక వర్గాల రూపురేఖలు మారిపోతాయని అందరూ ఆశించారు. కానీ ఓటమి అందరినీ ఆందోళనకు గురిచేసింది.

కారణాలు అనేకం..

కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు భూములు గుంజుకుంటారంటూ చేసిన ప్రచారం పెద్ద డ్యామేజీ చేసింది. అప్పట్లో కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి బాధిత గ్రామాల్లో అత్యధిక ఓట్లు బీజేపీ అభ్యర్థి ఖాతాలో పడడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కేసీఆర్ గెలిస్తే భూములు పోతాయనే ప్రచారం జనాల్లో భయాన్ని పెంచింది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టడంతో బీఆర్ఎస్ నాయకత్వం విఫలమైంది. మాస్టర్ ప్లాన్ రద్దుచేశామని, కేటీఆర్ బాధిత గ్రామాలకు చెందిన రైతులను పిలిపించి స్పష్టం చేశారు. ఎవరి భూములు ఎటూ పోవని సభలు, రోడ్‌షోల్లోనూ స్పష్టం చేశారు. ఎవరి భూములు ఎవరు గుంజుకుంటారని కూడా ప్రశ్నించారు. కామారెడ్డి భూముల్లో ఏమైనా లంకె బిందెలు ఉన్నాయా అని కూడా అన్నారు. అయినప్పటికీ ఆ గ్రామాల ప్రజలు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇదే సమయంలో దళితబంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు వంటి పథకాలు అయినవారికే ఇవ్వడం వంటి వాటిపై ఆయా వర్గాల్లో వ్యతిరేకతను పెంచిందని చెబుతున్నారు.

సమన్వయలోపం..

నియోజక వర్గంలో నేతల మధ్య సమన్వయం కుదిర్చేందుకు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినా, కమిటీ ఏనాడూ కూర్చుని సమీక్షించిన దాఖలాల్లేవు. సమన్వయ కమిటీ సభ్యుల మధ్యనే సమన్వయం లేకుండాపోయిందని బాహాటంగా చెప్పుకున్నారు. పోల్ మేనేజ్మెంట్, బూత్‌కమిటీలకు డబ్బుల పంపిణీ, కుల సంఘాలను మేనేజ్ చేయడం వంటి వాటి విషయంలోనూ సరిగా వ్యవహరించలేదన్నది స్పష్టమవుతోంది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని కనుమరుగైన ఉద్యమకారులు, న్యాయవాదులను, టీచర్లు, అధ్యాపకులను, ప్రజా సంఘాలను కలుపుకునిపోయి ఉంటే ఫలితం వేరుగా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ ఓటమిపై జరుగుతున్న పోస్టుమార్టంలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని భావిస్తున్నారు.

ఓటరు నాడి తెలుసుకునేందుకు..

కేసీఆర్ ఓటమిపై పోస్టుమార్టం చేస్తున్న పార్టీ అధిష్టానం కారణాలను అన్వేషించడంలో భాగంగా కొన్ని బృందాలను నియోజకవర్గానికి పంపించింది. వివిధవర్గాల వారిని కలిసి ఓటు ఎవరికి వేశారు..? కేసీఆర్‌కు వేయలేదంటే ఎందుకు వేయలేదు..? ప్రభుత్వం మీద వ్యతిరేకతా..? నాయకులు, ప్రజాప్రతినిధుల మీద వ్యతిరేకతతో వేయలేదా..? ప్రభుత్వ పథకాలు బాగా లేవా..? ఏ కారణం చేత ఓటు వేయలేదు..? అన్న ప్రశ్నలు అడుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సర్వే బృందాలు తిరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికలకు ముందు ఓటరు నాడి తెలుసుకునేందుకు సర్వే జరిపినట్టే, ఓటమికి గల కారణాల గురించి కూడా ఆరా తీస్తున్నారు. హోటళ్లు, కల్లు దుకాణాలు, కూడళ్లు తదితర చోట్లకు వెళ్లి ఒక్కొక్కరిని పట్టుకుని ఓటు ఎవరికి వేశారని, కేసీఆర్‌కు వేయలేదని అంటే ఎందుకు వేయలేదని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలయ్యాక ఇవేం ప్రశ్నలని కొందరు ఎదురు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. అయితే కేసీఆర్ సీఎం హోదాలో ఉండి పోటీ చేసి ఓడిపోయిన విషయంలో కారణాలు తెలుసుకుందామని తాము సర్వే చేస్తున్నట్లు ఆ బృందాలు చెబుతున్నాయి. కొన్ని చోట్ల ఓటెందుకు వేయలేదన్న దానిపై ప్రజలు ఓపెన్‌గా మాట్లాడుతున్నారు.

ఇబ్బంది పెడితే సహించను

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం(జుక్కల్) : జుక్కల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులను ఇబ్బందుల పాల్జేస్తే వారికోసం పోరాడుతానని, వారికోసం ప్రాణాలు అడ్డుపెడతానని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో శనివారం బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, మోహ్మద్‌నగర్, పిట్లం మండలాల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమావేశం ఏర్పాటు చేశారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఓటమికి కారణాలేంటో తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. ఎవరిపై నిందలు వేయవద్దన్నారు. వచ్చే ఎంపీ, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు పడకుండా ఎంపీపీలు, జెడ్పీటీసీలు చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధేను కలిసి కన్నీళ్లు పెట్టుకున్నారు. వారిని సింధే ఓదార్చారు. ఎప్పటికీ మీతోనే ఉంటానని ఎక్కడికి వెళ్లనని సింధే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాసరి రమేష్, విజయ్, మండల రైతు సమితి చైర్మన్ దేవేందర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘం చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం..







ప్రమాణస్వీకారం చేస్తున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు

తెలంగాణ అసెంబ్లీలో శనివారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. వారిలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి(బీఆర్ఎస్, బాన్సువాడ), తోట లక్ష్మీకాంతరావు(కాంగ్రెస్,జుక్కల్), మదన్‌మోహన్‌రావు(కాంగ్రెస్, ఎల్లారెడ్డి), సుదర్శన్‌రెడ్డి(కాంగ్రెస్, బోధన్), ప్రశాంత్‌రెడ్డి(బీఆర్ఎస్, బాల్కొండ), భూపతిరెడ్డి (కాంగ్రెస్, రూరల్) ఉన్నారు. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ కార్యక్రమం నిర్వహించారు. తోట లక్ష్మీకాంతరావు ఇంగ్లిష్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, రాకేశ్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయలేదు. – బాన్సువాడ/నాగిరెడ్డిపేట/జుక్కల్/మద్నూర్







పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ప్రశాంత్ రెడ్డి

చన్నీటి స్నానం.. చిన్నారుల దైన్యం

- బీసీ హాస్టళ్లలో బిగించని వేడి నీటి యంత్రాలు
- తీవ్ర చలితో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం



దోమకొండలోని బీసీ హాస్టల్

దోమకొండ : అసలే చలికాలం.. వేకవజామున మంచు కురుస్తూ గజగజ వణికిస్తోంది. మరోవైపు కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఇంతటి చలిలోనూ విద్యార్థులు చన్నీటి స్నానం చేస్తూ అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల పరిస్థితి దీనంగా మారింది. జిల్లాలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సోలార్ వేడినీటి యంత్రాలున్నాయి. కాని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మాత్రం ఎలాంటి వేడి నీటి యంత్రాలను అధికారులు బిగించలేదు. కనీసం ఆ దిశగా చర్యలు కూడా తీసుకోలేదు. వాస్తవానికి గతేడాది క్రితం ప్రభుత్వం అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో స్నానానికి వేడినీటిని అందించాలని సూచనలు చేసింది. కాని బీసీ వసతి గృహాల్లో మాత్రం ఇది అమలు కాలేదు. దీంతో విద్యార్థులు చల్లటిచలిలో చన్నీటి స్నానం చేస్తూ అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో 26 బీసీ వసతిగృహాలు

జిల్లాలో 26 బీసీ సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో దాదాపు 2,500 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా చలికాలం వచ్చిందంటే చల్లని నీటిలో స్నానాలను చేయడానికి అవస్థలు పడుతున్నారు. ఉదయం బోరు వచ్చిన నీరు ట్యాంకులకు నింపగా, నల్లాల కింద కూర్చుని చన్నీటి స్నానం చేస్తున్నారు.వారం రోజుల నుంచి చలి గాలులతో పాటు వర్షం కురుస్తుండగా చన్నీటి స్నానంతో ఇబ్బందులు పడుతున్నారు.

నల్లా కింద చల్లటి నీటితో..



నేను దోమకొండలోని బీసీ హాస్టల్‌లో ఉంటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాను. హాస్టల్‌లో చలికాలంలో చన్నీటి స్నానం చాలా ఇబ్బందిగా ఉంది. నల్లా కింద కూర్చుని చల్లనీ నీటితో స్నానం చేస్తున్నాం. వేడినీళ్లకు ఏర్పాట్లు లేవు.
– సాయిబాబా, బీసీ హాస్టల్ విద్యార్థి, దోమకొండ

జలుబు చేస్తుంది..



మాది పిట్లం మండలం కంబాపూర్ గ్రామం. ఇక్కడ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. చన్నీటి స్నానంతో హాస్టల్‌లో చాలా మంది విద్యార్థులకు జలుబు చేస్తుంది. జ్వరం కూడా వస్తుంది.
– శివ, బీసీ హాస్టల్ విద్యార్థి, దోమకొండ

వేడినీళ్లు ఇవ్వాలని సూచించాం

జిల్లాలో 26 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో 2,500 మంది విద్యార్థులు ఉన్నా రు. బీసీ హాస్టళ్లలో ప్రత్యేకంగా విద్యార్థులకు వేడి నీటిని అందించడానికి ఎ లాంటి వాటర్ హీటర్లు బిగించలేదు. నీటిని వేడిచేసి విద్యార్థులకు స్నానానికి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించాం. నిధులు రాగానే ప్రతి హాస్టల్‌లో వాటర్ హీటర్లను ఏర్పాటు చేస్తాం.
– శ్రీనివాస్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి, కామారెడ్డి

రావమ్మా.. మహాలక్ష్మి

- కామారెడ్డిలో పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు
- అనంతరం బస్సులో ప్రయాణం
- మహిళా ప్రయాణికుల్లో ఆనందం



కామారెడ్డి పట్టణంలోని ఆర్టీసీ బస్సులో ఉచిత టికెట్‌ను చూపుతున్న మహిళా ప్రయాణికులు

కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకాన్ని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించారు. ఉచిత టికెట్ పోస్టర్లను ఆవిష్కరించి, జెండా ఊపి పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. మహిళలు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. మహిళలు, స్కూల్, కళాశాల విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ఆర్టీసీ బస్సు లో ప్రయాణించారు. ఈ సందర్భంగా వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. డిపోల ఆవరణలో మహిళలతో బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. మొదటిరోజు బస్సులు మహిళలతో నిండిపోయాయి. ఈ కార్యక్రమంలో రవాణశాఖ జిల్లా అధికారి వాణి, డిపో మేనేజర్ ఇందిర, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం లక్షకు పైగా మహిళల ప్రయాణం

కామారెడ్డి, బాన్సువాడ ఆర్టీసీ డిపోల పరిధిలో మహిళలు లక్షకు పైగానే ప్రయాణిస్తారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. స్కూల్, కళాశాల విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు మగవారికంటే ఎక్కువగానే ప్రయాణిస్తారన్నారు. ఈ ఉచిత పథకం ద్వారా కామారెడ్డికి రూ. 10 లక్షలు, బాన్సువాడలో రూ. 9 లక్షలు ఆదాయం తగ్గుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో, గ్రామాల్లో మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కొన్ని బస్సుల్లో మహిళలతో నిండుకుని మగవారికైతే సీట్లు కూడా దొరకని దృశ్యాలు కనిపించాయి.

ఎస్పీ ఉచితంగా, కలెక్టర్ టికెట్ తీసుకుని..

మహాలక్ష్మి పథకం ప్రారంభించిన అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధూ శర్మలు పల్లెవెలుగు బస్సులో ప్రయాణించారు. అయితే ఎస్పీ మహిళ కావడంతో ఉచితంగా, కలెక్టర్ జితేష్ వి పాటిల్ డబ్బులు చెల్లించి టికెట్ తీసుకుని ప్రయాణించారు.



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్, ఎస్పీ



జెండా ఊపి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ



డబ్బులు చెల్లించి టికెట్ తీసుకున్న కలెక్టర్ పాటిల్

ప్రభుత్వానికి ధన్యవాదాలు



ఆర్టీసీ బస్సుల్లో మాకు కూడా ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు. మహిళలతో మాకు గుర్తింపు ఇచ్చారు. ఇక మేం కూడా ఉచితంగా ప్రయాణం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.
– దీప్తి, ట్రాన్స్‌జెండర్, కామారెడ్డి

డబ్బులు మిగిలాయి..



మాది నిజామాబాద్. బంధువులను చూడటానికి కామారెడ్డికి వచ్చాం. ముందు రోజు రూ. 200 టికెట్ తీసుకున్నాం. తిరిగి మా ఇంటికి బస్సులో ఉచితంగా వెళ్తున్నాం. డబ్బులు మిగిలినందుకు సంతోషంగా ఉంది.
– నర్సవ్వ, రామవ్వ, నిజామాబాద్

పేద, మధ్యతరగతి వారికి ఉపయోగం



నేను దోమకొండకు ఉచితంగా బస్సులో ప్రయాణిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. పేద, మధ్యతరగతి మహిళలు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. వారికి ఈ పథకం చాలా ఉపయోగకరం. ప్రయాణ డబ్బులు మిగిలిపోతాయి.
– బోద దీప, దోమకొండ

క్లుప్తంగా

జిల్లా కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్‌: తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్‌(టీపీఎస్‌ఎఫ్‌) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కే మహేశ్‌గౌడ్‌, ప్రధాన కార్యదర్శిగా హనుమండ్ల రాజు, కోశాధికారిగా గుగులోతు భాస్కర్‌, గౌరవ అధ్యక్షుడిగా ముక్త శివాజీతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. జూనియర్‌ పంచాయతీ కార్యదర్శిగా జాయిన్‌ అయిన ప్రతి ఒక్కరికీ పూర్తి సర్వీస్‌ కాలాన్ని కౌంట్‌ చేస్తూ రాష్ట్రస్థాయి కామన్‌ ఎఫెక్ట్‌ డేట్‌ వర్తింపజేయాలని, ఒప్పంద పంచాయతీ కార్యదర్శులను సైతం సర్వీస్‌ కౌంట్‌ చేసి ప్రభుత్వ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని తీర్మానాలు చేశారు. తమ డిమాండ్ల సాధనం కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బయటపడిన కాంగ్రెస్‌ నిజస్వరూపం

• ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ



సుభాష్‌నగర్‌: అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ ఓవైసీని ఎంపిక చేయడంతో కాంగ్రెస్‌ నిజస్వరూపం బయట పడిందని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను ఎంపిక చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఈ పదవితో కాంగ్రెస్‌, ఎంఐఎం దోస్తానా బయట పడిందని ఆరోపించారు. ప్రొటెం స్పీకర్‌ ఎన్నికను నిరసిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన



ఖలీల్‌వాడి: ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్‌, మాజీ మేయర్‌ ధర్మపురి సంజయ్‌, పార్టీ నగర అధ్యక్షుడు కేక్‌ కట్‌ చేసి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పాటు చేసిన తెలంగాణను దొరల తెలంగాణగా చేసి కేసీఆర్‌ కుటుంబం దోచుకుందన్నారు. సోనియా గాంధీ బర్త్‌డేకు తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌ పార్టీ ముందుకెళ్తుందని తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌ గౌడ్‌, జిల్లా కిసాన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, వేణు రాజ్‌, సంతోష్‌, రాజ నరేందర్‌గౌడ్‌, యాదగిరి, సయ్యద్‌ఖైసర్‌, ఈసా, రామకృష్ణ, మహేశ్‌, పోల ఉష, చంద్రకళ, మలైకా బేగం, సుమన్‌, రేవతి, వినయ్‌, సుభాష్‌, గన్‌రాజ్‌, విజయ్‌పాల్‌రెడ్డి, రవి, ఎల్లయ్య, సాయిలు, స్వామి గౌడ్‌ పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’కి శ్రీకారం

• కాంగ్రెస్‌ ప్రభుత్వం మొదటి పథకం అమలు
• హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా లోకం
• బస్టాండ్‌లలో పెరిగిన మహిళా ప్రయాణికుల తాకిడి

సాక్షి నెట్‌వర్క్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణవసతి కల్పిస్తూ అందుబాటులోకి తెచ్చిన మహాలక్ష్మి పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ బస్సుల్లో మహాలక్ష్మి పథకాన్ని శనివారం ప్రవేశపెట్టారు.

అనంతరం మహిళలతో కలిసి అధికారులు బస్సుల్లో ప్రయాణించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉచితంగా బస్సులో ప్రయాణించడం ఆనందంగా ఉందని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం మాటల వరకే అనుకున్న కాంగ్రెస్‌ ప్రభుత్వం తమ పథకాలను చేసి చూపెడుతుండడం ఆనందంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని బస్‌ డిపోల్లో అధికారులు, పార్టీ నాయకులు మధ్యాహ్నం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించడంతో బస్టాండ్‌లలో మహిళా ప్రయాణికుల తాకిడి పెరిగింది. పథకం అమలు కావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.



ఆర్మూర్‌లో బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, కాంగ్రెస్‌ నాయకులు

ఉచిత ప్రయాణం బాగుంది



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషంగా ఉంది. బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రయాణం చేస్తున్నా. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– లత, బాన్సువాడ

మహిళలతో సమానంగా..



మహిళలతో సమానంగా ట్రాన్స్‌జెండర్లకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం ఆనందంగా ఉంది. సీఎంకు రుణపడి ఉంటాం. బాన్సువాడ నుంచి బొగ్గుగుడిసె వరకు బస్సులో ఉచితంగా ప్రయాణించా.

– రష్మిత, ట్రాన్స్‌జెండర్‌

రూ. 400 ఖర్చు అయ్యేది



హైదరాబాద్‌లో ఉండే నా మనుమండ్లు, మన మరాళ్ల వద్దకు వెళ్లేందుకు రూ. 400 ఖర్చయ్యేది. కాంగ్రెస్‌ ప్రభుత్వం పుణ్యమా అని ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నా. ఇకపై వాళ్లని చూడటానికి ఎప్పుడైనా వెళ్లి రావచ్చు.

– నాగమణి, గూపన్‌పల్లి

ఆరు గ్యారంటీలకు కట్టుబడి ఉంది



కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు కట్టుబడి ఉంది. మహిళలకు మొదటి ప్రాధాన్యతంగా ‘మహాలక్ష్మీ పథకం’ ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. – రేవతి, మహిళా కాంగ్రెస్‌ నగర అధ్యక్షురాలు, నిజామాబాద్‌

పైసలు బాగా ఖర్సయితుండే



గత సర్కారోల్లు బస్సుల్ల టికెట్‌ రేట్లు అడ్డగోలుగా పెంచిండ్రు. ఎటన్న ఊర్లకు పోవాలంటే బాగా ఖర్చయితుండే. పింఛను పైసలు బస్సుల టికెట్లకు అయిపోతుండే. కాంగ్రెస్‌ పార్టీ మహిళలను గుర్తించినందుకు కృతజ్ఞతలు.

– రామవ్వ, సిరికొండ

పుణ్యక్షేత్రాలకు ఉచితంగా వెళ్లొచ్చు



కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగపడుతుంది. పెరిగిన ఖర్చులతో ఎన్నో పుణ్యక్షేత్రాలకు వెళ్లలేని మహిళా భక్తులకు ఎంతో ఉపయోగకరం. ప్రభుత్వం మంచి ఆలోచన తీసుకుంది.

– గడ్డం సావిత్రి, మల్కాపూర్‌(ఎ)

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది



కాంగ్రెస్‌ ప్రభుత్వానికి మహిళలపై గౌరవంతో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకం బాగుంది. అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు.

– సూరం సారిక, అనంతగిరి

ప్రమాదాలు తగ్గుతాయి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం శుభపరిణామం. దీంతో రోడ్లపై ట్రాఫిక్‌ జాం, ప్రమాదాలు తగ్గుతాయి. కాంగ్రెస్‌ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం మంచి ఫలితాలు ఇవ్వాలని కోరుకుంటున్నా.

– రమ్య, పోచారంపేట్‌, కామారెడ్డి

మహిళలకే మొదటి ప్రాధాన్యత



ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌ ప్రభుత్వం మహిళలకే మొదటి ప్రాధాన్యత కల్పించడం ఆనందంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని పథకాలను కాంగ్రెస్‌ అమలు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడం సంతోషంగా ఉంది.

– పోచమ్మ, మార్దాండ, పిట్లం

థ్యాంక్యూ కాంగ్రెస్‌..



ప్రచారంలో అన్ని పార్టీల మాదిరిగానే కాంగ్రెస్‌ ఇచ్చే హామీలు ఉత్తవే అనుకున్నా. కానీ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండడమే కాకుండా మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పించడం ఆనందంగా ఉంది. థ్యాంక్యూ కాంగ్రెస్‌. – కళావతి, ప్రయాణికురాలు

కూలి డబ్బులు మిగులుతాయి



ప్రతినిత్యం కూలీ కోసం వేరే గ్రామాలకు బస్సుల్లో ప్రయాణిస్తుంటా. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం మాలాంటి వారికి ఎంతో మేలు. చేసిన కూలి డబ్బులు మిగులుతాయి. సంతోషంగా ఉంది.

– ఎచ్చుం లక్ష్మి, ప్రయాణికురాలు

బస్సు ఎక్కే వరకు తెల్వదు



ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయం ఆనందంగా ఉంది. కొమలంచ నుంచి రుద్రూర్‌ వరకు ఉచితంగా ప్రయాణించా. బస్సు ఎక్కే వరకు మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం అనేది తెలియదు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– భూదేవ్వ, లక్ష్మి, రుద్రూర్‌

ఎంతో ఆనందంగా ఉంది



నేను బోధన్‌ నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న. బోధన్‌లో ఎక్స్‌ప్రెస్‌ దొరికింది. ఉచితంగా హైదరాబాద్‌ వెళ్లడం ఆనందంగా ఉంది. పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషకరం.

– సుష్మా, హైదరాబాద్‌

రూ.40 ఆదా అయినవి



నవీపేట నుంచి నిజామాబాద్‌లోని బంధువుల ఇంటికి శుక్రవారం వెళ్లా. తిరిగి నవీపేటకు శనివారం మధ్యాహ్నం బస్సు ఎక్కగా టికెట్‌ లేదన్నారు. ఫ్రీగా వెళ్తున్నానని తెలిసి ఆనందంగా భావించా. రూ. 40 ఆదా అయ్యాయి.

– గుజ్జుల లత, నవీపేట

గరీబోళ్లకు ఎంతో మేలు



నిన్నటి వరకు బస్సుల్లో బంధువుల ఇళ్లకు వెళ్లాలంటే బస్సుల్లో రూ. వంద ఖర్చయ్యేది. కానీ కాంగ్రెసోళ్లు అధికారం చేపట్టాక మాలాంటి గరీబోళ్లకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నాం.

– సాయవ్వ, చించోలి

మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్‌



నాకు బుద్ధి తెలిసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల టికెట్ల రేట్లు పెంచుడు అనే మాటే విన్నాం కానీ ఇప్పుడు ఫ్రీ జర్నీ అంటే చాలా బాగుంది. ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు.

– గంగామణి, భీమ్‌గల్‌

పేదోళ్లకు మంచిది



కాంగ్రెసోల్లు బస్సులల్ల ఆడోళ్లకు టికెట్‌ లేకుండా చేయడంతో పేదొల్లకు ఎంతగానో మంచిగయింది. ఎటన్న ఊర్లకు పోదామంటే ఇంతకు ముందు వందలు వందలు ఖర్చు అయితుండే. ఇప్పుడు టికెట్‌ లేకుండా బస్సులల్ల పోవడంతో ఎంతో వసతయితుంది.

– కంసాలి, కోనరావుపేట

ప్రతీ గ్రామానికి బస్సులు నడపాలి



మహిళలకు బస్సుల్లో ఫ్రీ జర్నీ బాగుంది. కానీ ఆర్టీసీ బస్సులను పల్లె ప్రజల వద్దకు కూడా తీసుకెళ్తే ఎక్కువ మంది మహిళలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆటోలను ఆశ్రయించకుండా బస్సుల కోసం ఎదురు చూస్తారు.

– సువర్ణ, నిర్మల్‌

ఇక బస్సులోనే..



బస్సు కోసం ఎదురు చూసే ఓపిక లేక ఆటోల్లో ప్రయాణించే వారిమి. ఆటోల వారు ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేసే వారు. ఇకపై బస్సుల్లో ఫ్రీ ప్రయాణం కాబట్టి బస్సులు వచ్చేదాక ఎదురు చూస్తాం.

– రాధ, తల్వేద

సోనియా గాంధీకి కృతజ్ఞతలు



ఎన్నికల్లో కాంగ్రెస్‌ ప్రభుత్వం గెలిచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉంది. తెలంగాణ ప్రజలకు ఉచిత బస్సు పథకం రూపొందించిన కాంగ్రెస్‌ అధ్యక్షురాలు సోనియా గాంధీకి కృతజ్ఞతలు.

– కస్తూరి, చెరువు కొమ్ము తండా



బొగ్గుగుడిసె చౌరస్తా వద్ద బస్సు ఎక్కుతున్న మహిళలు



ఎల్లారెడ్డిలో..



మహమ్మద్‌నగర్‌లో..



బాన్సువాడలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు

చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్‌: బోర్గాం(కె) శివారులో ఉన్న ముసలికుంట చెరువులో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

వివాహిత అదృశ్యం

సిరికొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై రమేశ్‌ తెలిపారు. ఈ నెల 8న తన ఆరు నెలల బాబుతో ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదన్నారు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్‌: కోటగిరి మండలంలోని ఓ తండాకు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్‌ శనివారం తెలిపారు. శనివారం ఉదయం ఇంట్లో గొడవ జరగడంతో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త తారాసింగ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోర్ట్‌పోలియో న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



కామారెడ్డి టౌన్‌: జిల్లా కోర్టును సందర్శించిన హైకోర్టు పోర్ట్‌పోలియో న్యాయమూర్తి లక్ష్మీనారాయణను కామారెడ్డి బార్‌ అసోసియేషన్‌ సభ్యులు, న్యాయవాదులు శనివారం కలిశారు. పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అతిమాముల శ్రీధర్‌, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్‌, సీనియర్‌ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి, లక్ష్మణరావు, అమృతరావ్‌, శ్యాంగోపాల్‌రావు, మాయ సురేశ్‌, శ్రీనివాస్‌ తదితరులున్నారు.

మొరం క్వారీలో పేలుడు పదార్థాలు లభ్యం

• క్వారీ సీజ్‌, చిన్నాపూర్‌ సర్పంచ్‌ భర్తపై కేసు నమోదు
• కేసు నుంచి తప్పించుకున్న మాజీ ఎమ్మెల్యే బామ్మర్ది

మాక్లూర్‌: మండలంలోని చిన్నాపూర్‌ శివారులో కొనసాగుతున్న మొరం క్వారీపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు, సీఐ సతీశ్‌, ఎస్సై సుధీర్‌రావు, మైన్స్‌ ఏడీ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమైన దాడులు శనివారం కూడా కొనసాగాయి.

చిన్నాపూర్‌ సర్పంచ్‌ పుప్పాల లక్ష్మి భర్త గంగారెడ్డికి చెందిన ఈ క్వారీలో రాళ్లను పగులగొట్టే పేలుడు పదార్థాలు లభ్యం కావడంతో నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీలను అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంగారెడ్డి గతేడాది మొరం తవ్వకాల కోసం భూగర్భ గణుల శాఖ నుంచి అనుమతి తెచ్చుకున్నాడు. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బామ్మర్ది తనను పాట్నర్‌గా చేర్చుకోవాలని అన్నీ తానై చూసుకుంటానని ఒత్తిడి తెచ్చి పాట్నర్‌గా చేరాడు. నాటి నుంచి నేటి వరకు క్వారీ ఆయనే నడిపించాడు. తీరా అధికారుల దాడులతో క్వారీకి నాకు ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే బామ్మర్ది చేతులెత్తేశాడు. అంతేకాకుండా నా పేరు బయటకు వస్తే బాగుండదని గంగారెడ్డిని హెచ్చరించినట్లు తెలిసింది. అలాగే సమీపంలో కొనసాగుతున్న మరో మొరం క్వారీలో రెండు టిప్పర్లు, జేసీబీని అధికారులు పట్టుకుని పీఎస్‌కు తరలించారు. అనుమతులు లేకుండా మొరం తరలిస్తే సహించేది లేదని మైన్స్‌ ఏడీ సత్యనారాయణ హెచ్చరించారు.



విచారణ చేపడుతున్న పోలీసులు, అధికారులు



గుట్టలను తవ్వుతున్న జేసీబీలు

బస్వాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు: బస్వాపూర్‌ గ్రామంలో కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన పూజారి శ్రీకాంత్‌(29) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలుచోట్ల చూయించినా నయం కాకపోవడంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

రామారెడ్డి: అనారోగ్యంతో వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన అర్గొండ పెద్దలింగం (62) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న పెద్దలింగం ఆస్పత్రిలో చూయించినా నయం కాకపోవడంతో పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్‌ అందజేత



ఎల్లారెడ్డిరూరల్‌: సెల్‌ఫోన్‌ పోగొట్టుకున్న బాధితుడికి సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా ఫోన్‌ను గుర్తించి అందించినట్లు ఎస్సై గణేశ్‌ శనివారం పేర్కొన్నారు. మండలంలోని గండిమాసానిపేటకు చెందిన లునావత్‌ దేవీసింగ్‌ సెల్‌ ఫోన్‌ ఇటీవల పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఈఐఆర్‌ పోర్టల్‌ ద్వారా ఫోన్‌ను గుర్తించి అప్పగించినట్లు పేర్కొన్నారు.